క్లుప్తంగా

చప్టాపై గుంతలు... నిలిచిన రాకపోకలు



వీరులపాడు: ఎగువ నుంచి వస్తున్న వరద కారణంగా మండలంలోని పల్లెంపల్లి గ్రామ సమీపంలోని వైరా కట్టలేరు ఉధృతంగా పొంగి ప్రవహిస్తుండటంతో చప్టాపై భారీగా గోతులు పడ్డాయి. వాహనదారులు జాగ్రత్తలు పాటించ కుంటే ప్రమాదాల బారినపడే అవకాశం ఉంది. విషయం తెలుసుకున్న వీరులపాడు ఎస్ఐ మహాలక్ష్మణుడు ఆదివారం చప్టాను పరిశీలించారు. చప్టాపై భారీగా గోతులు ఏర్పడిన నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యగా వాహనాల రాకపోకలను నిలుపుదల చేశారు. వాహనదారులు రాకపోకలు సాగించకుండా రహదారిపై బండరాళ్లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు బియ్యం పంపిణీ



నందిగామ టౌన్: వరద బాధితులను, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవటం ఎంతో సంతృప్తినిస్తోందని దూలాస్ ట్రస్ట్ డైరెక్టర్ డాక్టర్ పగిడిపల్లి మణిఆనంద్ అన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇబ్బందులుపడిన కోనసీమ అంబేద్కర్ జిల్లాలోని లంక గ్రామాలకు 300 మందికి తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో బియ్యం, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని అందరూ ఆదుకోవాలని కోరారు. ట్రస్ట్ నిర్వాహకులు దేవసహాయం, రత్న వినోద్, జ్ఞానవరకుమార్, హర్షిత, సంతోష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘ అభివృద్ధికి కృషి చేయాలి

నందిగామ టౌన్: ఆర్యవైశ్య సంఘ అభివృద్ధే లక్ష్యంగా పాలకవర్గాలు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆర్యవైశ్య సంఘ జిల్లా అధ్యక్షుడు బొగ్గవరపు వెంకట రాజారావు కోరారు. పట్టణంలోని కాకులయ్య వీధిలోని ఆర్యవైశ్య సంఘ మండల గౌరవాధ్యక్షుడు చల్లా వెంకట నరసయ్య నివాసంలో ఆదివారం మండల ఆర్యవైశ్య సంఘ సమావేశం నిర్వహించారు. ముందుగా వాసవీ కన్యకాపరమేశ్వరీ, భరత మాత చిత్రపటాలకు పూలమాలలు వేసి పూజలు చేశారు.ఈసందర్భంగా వెంకటరాజారావు మాట్లాడుతూ నందిగామ మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షునిగా చవట నాగేశ్వరరావు, కార్యదర్శిగా పబ్బతి సీతారామగుప్త, కోశాధికారిగా మహంకాళి చంద్రశేఖర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. అనంతరం నూతన సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. సంఘ బలోపేతానికి కృషి చేయడంతోపాటు సభ్యత్వ నమోదును పెంచాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ మాస పూజలు



జగ్గయ్యపేట అర్బన్: శ్రావణమాస మహోత్సవాల మొదటి ఆదివారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పలు అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక అద్దాలబజారులోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి వెండిదేవాలయం, నకాశిబజారులోని శ్రీకనక దుర్గ అమ్మవారి ఆలయం, దుర్గాపురంలో ఉన్న శ్రీదుర్గామల్లేశ్వరస్వామి తదితర ఆలయాల్లో అమ్మవారు ప్రత్యేకాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కోదాడ రోడ్‌లోని పుట్టబజారులో కలకత్తా కాళీమాత విశ్వరూప శివ దుర్గాభవానీమాతను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పట్టణంలోని శ్రీముత్యాలమ్మ అమ్మవారిని శాకంబరి దేవిగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అప్పన మణికుమార్, కొత్తా రమేష్‌కుమార్, కార్యవర్గ సభ్యులు నోముల శివకుమార్, కొంకిమళ్ల సురేష్, అప్పన పిచ్చయ్య, చేడె శ్రీరంగం, దేవరశెట్టి నాగప్రసాద్, ఆరేపల్లి వెంకటేశ్వర్లు పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు. వెండి దేవాలయం ఆలయ కమిటీ చైర్మన్ అత్తులూరి వెంకటేశ్వర్లు, శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయ ప్రైవేటు ఇంప్రూవ్‌మెంటు కమిటీ సభ్యులు, దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొని భక్తులకు ఇబ్బందులు లేకుండా తగు ఏర్పాట్లు చేశారు.

తగ్గిన వరద ప్రవాహం

బయటపడిన భవానీ ముక్తేశ్వరస్వామి ఆలయం



వరద ప్రవాహం తగ్గడంతో బయటపడిన ముక్తేశ్వరస్వామి ఆలయం

జగ్గయ్యపేట: శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల నుంచి వరద ప్రవాహం తగ్గడంతో పట్టడంతో దిగువనున్న పులిచింతల ప్రాజెక్టుకు వరద తగ్గుముఖం పట్టింది. ఐదు రోజులుగా ఉధృతంగా ఉన్న కృష్ణానది ప్రవాహం ఆరోరోజు ఆదివారం తగ్గుముఖం పట్టింది. మండలంలోని ముక్త్యాల గ్రామ సమీపంలోని పులిచింతల ప్రాజెక్టు నుంచి రెండు గేట్ల ద్వారా లక్ష క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండటంతో కృష్ణానది పరివాహక ప్రాంతాలైన ముక్త్యాల, రావిరాల, వేదాద్రి గ్రామాల్లోనూ వరద ప్రవాహం తగ్గింది. నదీప్రవాహం తగ్గడంతో ఇప్పటివరకు పూర్తిగా నీటిలో మునిగిపోయి ఉన్న ముక్త్యాల భవానీ ముక్తేశ్వరస్వామివారి ఆలయం పైభాగం బయట పడింది.



ముక్త్యాల వద్ద స్వల్పంగా దెబ్బతిన్న మత్స్యకారుల పడవలు

ఇబ్బందుల్లో మత్స్యకారులు..

నదీ పరివాహక ప్రాంతాల్లో గ్రామాల్లో మత్స్యకారులకు కృష్ణమ్మ కష్టాలు తెచ్చిపెట్టింది. ఆరు రోజులుగా ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఒడ్డునున్న పడవలు స్వల్పంగా ధ్వంసంకాగా, కొన్ని వలలు కూడా నదిలో కొట్టుకుపోయాయి. ముక్త్యాల, రావిరాల గ్రామాలకు చెందిన 15వలలు కొట్టుకుపోయాయని మత్స్యకారులు ఆవేదన చెందుతున్నారు. పడవల్లో కూడా నీరు చేరడంతో స్వల్పంగా ధ్వంసమయ్యాయని వారు చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి..



కృష్ణానదికి వరద వచ్చే సమయంలో అనేక ఇబ్బందులు పడుతున్నాం. వరద ఉధృతికి పడవలు ధ్వంసం కాగా, వలలు కొట్టుకుపోయాయి. ఒక్కో వల రూ.10 వేలకు పైగా ఉంటుంది. ప్రభుత్వం స్పందించి వలలు అందజేసి మమ్మల్ని ఆదుకోవాలి.

– పిట్టల రామకృష్ణ, మత్స్యకారుడు, ముక్త్యాల



వరద నీరు తగ్గడంతో బయటపడిన పుష్కర ఘాట్‌లు



తెగిన వలలను సరిచేసుకుంటున్న మత్స్యకారులు

ముగిసిన శిక్షణా తరగతులు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): తడిపొడి చెత్త, పారిశుద్ధ్యం తదితర అంశాలపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు ఆదివారంతో ముగిశాయి. శిక్షణ తరగతులనుద్దేశించి ఈవోపీఆర్డీ సాంబశివరావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో తడిపొడి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత కార్యదర్శులు, సచివాలయ సిబ్బందిదేనన్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్య నిర్మూలనకు ప్రత్యేకచర్యలు తీసుకోవాలని సూచించారు. ఏవో రాజు, ట్రైనర్ సరోజిని, కార్యదర్శి శ్రావణ్ పాల్గొన్నారు. అనంతరం మండలంలోని బూదవాడలోని తడిపొడి చెత్తనుంచి సంపద తయారీ ప్రక్రియను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

నందిగామలో..

నందిగామ టౌన్: సంపద తయారీపై సర్పంచ్‌లు, కార్యర్శులు అవగాహన పెంపొందించుకోవాలని నందిగామ ఇన్‌చార్జి ఎంపీపీ ఆకుల హనుమంతరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ కార్యక్రమంలో భాగంగా మూడురోజులుగా నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు ఆదివారంతో ముగిశాయి. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి, సంపద తయారీ, పారిశుద్ధ్యం, తాగునీరు, గ్రామపంచాయతీ తీర్మానాలు తదితర అంశాలపై సర్పంచులు అవగాహన కలిగి ఉంటేనే గ్రామాభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ఆయా అంశాలపై అవ గాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఎంపీడీవో విశ్వనాద్, ఈవోపీఆర్డీ పద్మజ్యోతి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.



బూదవాడలో వర్మికంపోస్టు తయారీ విధానాన్ని పరిశీలిస్తున్న సర్పంచులు, కార్యదర్శులు

సంపద తయారీపై దృష్టి సారించాలి..

వీరులపాడు: గ్రామాల అభివృద్ధి, సంపద తయారీపై పంచాయతీ పాలకులు దృష్టి సారించాలని ఎంపీడీవో శివపార్వతి సూచించారు. జుజ్జూరులోని మండల పరిషత్ కార్యాలయంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ కార్యక్రమంలో భాగంగా మూడురోజులుగా నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలు ఆదివారంతో ముగిశాయి. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్పంచులు, కార్యదర్శులు గ్రామాల్లోని వనరులను వినియోగించుకుని గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు పంపి, వర్మికంపోస్టు తయారీ ద్వారా ఆదాయం పొందే విధానంపై అవగాహన కల్పించారు .అనంతరం పొన్నవరం గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, సర్పంచ్ షోడగిరి రాజశ్రీ, ఆయాగ్రామాల సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

కోఆపరేటివ్ సొసైటీ ఎన్నికల్లో యూటీఎఫ్ విజయం

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట, వత్సవాయి మండలాలకు సంబంధించిన టీచర్స్ కోపరేటివ్ సొసైటీ ఎన్నికల్లో యూటీఎఫ్ ప్యానల్ అభ్యర్థులు ఘనవిజయం సాధించారు. మొత్తం 350మంది సభ్యులు ఉన్న ఈసొసైటీకి ప్రతి 5 ఏళ్లకు ఒకసారి ఎన్నికలు జరుగుతాయి. ఈ క్రమంలో ఆదివారం పట్టణంలోని ఆర్టీసీ డిపో సమీపంలో ఉన్న టీచర్స్ కోపరేటివ్ సొసైటీ భవన్‌లో ఎన్నికలు నిర్వహించగా, మొత్తం ఏడు డైరెక్టర్ పోస్టులకు ఉపాధ్యాయసంఘాలు రెండు ప్యానళ్లుగా బరిలోకి దిగాయి. మొత్తం 20 మంది పోటీ చేశారు. నాలుగు డైరెక్టర్ పదవులను గెలుచుకున్న ప్యానల్ విజయం సాధించినట్లుగా భావిస్తారు. ఈ ఎన్నికల్లో యూటీఎఫ్ ఓ ప్యానల్‌గా పోటీచేయగా, పీఆర్‌టీయూ, ఎస్టీయూ, హెచ్ఎమ్స్ అసోసియేషన్ కలిసి మరోప్యానల్‌గా పోటీలోకి దిగాయి. మొత్తం ఏడు డైరెక్టర్ పదవులకుగాను ఐదు పదవులను యూటీఎఫ్ కైవసం చేసుకుంది. పీఆర్‌టీయూ అలయన్స్ ప్యానల్ రెండు డైరెక్టర్ పదవులను గెలుచుకుంది. యూటీఎఫ్ ప్యానల్ నుంచి పోటీచేసిన వారిలో ఎం.కృష్ణయ్య, సీహెచ్ఎస్ఎస్ మూర్తి, అల్లిక నరసింహారావు, అజ్మీరు శ్రీను, సయ్యద్ రషీద గెలుపొందగా, పీఆర్‌టీయూ అలయన్స్ ప్యానల్ నుంచి నేలవెల్లి రమేష్‌బాబు, చిత్రాల వెంకటేశ్వరరావు విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి, నందిగామ కోపరేటివ్ సొసైటీస్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ జె.వేణుగోపాల్ తెలిపారు. విజేతలను ఉపాధ్యాయులు అభినందించారు.



డైరెక్టర్లుగా గెలుపొందిన వారికి ధ్రువీకరణపత్రాలు అందజేస్తున్న ఎన్నికల అధికారి వేణుగోపాల్

దాడి ఘటనపై పోలీసులకు ఫిర్యాదు

పెనుగంచిప్రోలు: మండల కేంద్రం పెనుగంచిప్రోలులో ట్రాన్స్‌జెండర్స్‌పై దాడి ఘటనకు సంబంధించి ఫిర్యాదు వచ్చినట్లు ఏఎస్ఐ శంకర్ తెలిపారు. పోలీసులు కథనం మేరకు.. గుంటూరుకు చెందిన పలువురు ట్రాన్స్‌జెండర్స్ ఆదివారం పెనుగంచిప్రోలులో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి దర్శనానికి వచ్చారు. ఆలయం ముందు సెల్‌ఫోన్ కౌంటర్ వద్ద ట్రాన్స్‌జెండర్స్, కౌంటర్‌లో ఉండే సిబ్బందికి మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. అనంతరం తాము గుంటూరుకు వెళ్తుండగా చెరువుకట్ట సమీపంలో సుమారు ఏడుగురు వ్యక్తులు తమ కారు అద్దాలు పగుల కొట్టటంతోపాటు తమపై దాడి చేసి గాయపరిచారని ట్రాన్స్‌జెండర్స్ ఫిర్యాదు చేసినట్లు ఏఎస్ఐ వివరించారు.

అమ్మవారికి బోనాలు సమర్పణ



జగ్గయ్యపేట అర్బన్: పట్టణ సమీపంలోని విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ మైనింగ్ క్వార్టర్స్ వద్ద నున్న శ్రీనాగసత్యమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారికి శ్రావణమాసం మొదటి ఆదివారం సందర్భంగా భక్తులు వార్షిక బోనాలను సమర్పించారు. స్టీల్ ప్లాంట్ జగ్గయ్యపేట లైమ్‌స్టోన్ మైన్స్ ఉద్యోగులు ఏటా శ్రావణమాసం మొదటి ఆదివార ం రోజున అమ్మవారికి ఘనంగా బోనాలను సమర్పించడం ఆనవాయితి. అందులో భాగంగా అమ్మవారికి పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు టీఎల్ఎస్.ఆచార్యులు, కృష్ణ భరద్వాజ్, సంపత్ జానకీరామ్ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం జెఎల్ఎం ఇన్‌చార్జ్ నాగరాజు దంపతులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్టీల్ ప్లాంట్ జెఎల్ఎం ఉద్యోగులు, పూర్వ ఉద్యోగులు, ప్రముఖులు, పెద్ద సంఖ్యలో మహిళలు అమ్మవారికి తమ బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



నాగసత్యమ్మ అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న ఉద్యోగులు, మహిళలు

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

కంచికచర్ల : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం పదిగంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పి.జాహ్నవి ఆదివారం తెలిపారు. ఆయా సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వాటిని పరిష్కరిస్తామని తహసీల్దార్ వివరించారు.

ప్రమాదకరంగా రోడ్డు



పెనుగంచిప్రోలు: మండల కేంద్రం పెనుగంచిప్రోలులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో రోడ్డు అత్యంత ప్రమాదకరంగా మారింది. రోడ్డు మొత్తం పెద్దపెద్ద గుంతలు పడ్డాయి. వర్షాలకు గుంతల్లో నీరు చేరడంతో ప్రమాదాలకు కారణమవుతోంది. గుంతల్లో పడి పలువురు వాహనదారులు గాయాల పాలయ్యారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

• తిరుపతమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

పెనుగంచిప్రోలులో వేంచేసి ఉన్న తిరుపతమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. శ్రావణమాసం సెలవు దినం కావటంతో పాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. దీంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. వేకువ జామునుండే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్న సమయంతో మునేరు అవతల మామిడి తోటల్లో సేదదీరారు.

– పెనుగంచిప్రోలు

ఆదమరిస్తే అనారోగ్యమే

- మందుల పిచికారీలో నిర్లక్ష్యం వద్దు
- రక్షణ చర్యలు పాటించాలి

వత్సవాయి : రైతులు పంటల్లో చీడపీడల నివారణకు విచ్చలవిడిగా పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. పురుగుమందుల వాడకం తప్పనిసరైన పరిస్థితుల నేపథ్యంలో రైతులు సరైన జాగ్రత్తలు పాటించకపోతే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. పిచికారీ సందర్భాల్లో సరైన జాగ్రత్తలు పాటించకపోతే రైతులు, కూలీలు ఆస్పత్రి పాలైన సందర్భాలు కూడా ఉన్నాయి. ఆదమరిస్తే ప్రాణనష్టం కూడా జరిగే ప్రమాదం ఉంది. ఆయా పంటల సాగులో మందుల పిచికారీ చేసేటప్పుడు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల వ్యవసాయాధికారి వి.రవికుమార్ పలు సూచనలు రైతులకు చేస్తున్నారు.

పాటించాల్సిన జాగ్రత్తలు...

- ఆయా పంటల సాగులో చీడపీడల నివారణకు పురుగుమందులు పిచికారీ చేసేందుకు పరిశుభ్రమైన నీటినే వాడటంతోపాటు చేతులు, కళ్లు, ముక్కు, నోరు, చెవులకు ప్రత్యేక రక్షణ తీసుకోవాలి.
- తలకు టోపీతోపాటు ముఖమంతా కప్పేటట్లు చూసుకోవాలి .



పత్తిలో పురుగుమందు పిచికారీ చేస్తున్న రైతు

- పురుగుమందుల వెంబడి వచ్చిన కవర్లను వినియోగించరాదు.
- ద్రావకాన్ని కలిపే ముందు డబ్బాపై ఉన్న లేబిల్‌ను గమనించి, అందుకునుగుణంగా కలుపుకోవాలి.
- మందు కలిపేటప్పుడు ఖచ్చితంగా కళ్లజోడు ఉంచుకోవాలి లేనిపక్షంలో కలిపేటప్పుడు చిందులు కళ్లలో పడే ప్రమాదం ఉంది.
- ద్రావకాన్ని పంపులో పోసేటప్పుడు, పిచికారీ చేసేటప్పుడు బీడీ, సిగరెట్ కాల్చరాదు. ఖైనీ వేయకూడదు.
- మందును ముక్కుతో వాసన చూడకూడదు. పిచికారీ తరువాత భోజనం చేసేటప్పుడు సబ్బుతో శుభ్రంగా చేతులు కడుక్కోవాలి.

పురుగుమందు పిచికారీ విధానం..

- పిచికారీ చేసే డబ్బా సరైనది ఎంచుకోవాలి. డబ్బా లోపలి నుంచి కారకుండా చూసుకోవాలి.
- సరైన నాజిల్ ఎంచుకోవాలి. పిచికారీ సమయంలో నాజిల్‌లో ఏదైనా అడ్డుపడితే నోటితో ఊదకూడదు.
- పురుగుమందులు, కలుపుమందులు నివారణకు ఒకే డబ్బాను ఉపయోగించరాదు.
- గాలి ఎక్కువగా వీచేటప్పుడు, ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు పిచికారీ ప్రయత్నాలు మానుకోవాలి.
- పిచికారీ సమయంలో గాలి వస్తున్నట్లయితే గాలికి వ్యతిరేకంగా పిచికారీ చేయకుండా గాలి వాలుకు చేసుకోవాలి.
- మందుల కలిపిన డబ్బాలలో నీరు పట్టుకోని తాగరాదు
- పిచికారీకి పూర్తయిన తరువాత మందు డబ్బాలను విచ్చలవిడిగా పడేయకూడదు.
- మందు డబ్బాలను కడిగి కాల్వలు, నీటికుంటల్లో పోయకూడదు.
- అవసరాలకు అనుగుణంగా మాత్రమే మందును కలుపుకోవాలి.
- చిన్నపిల్లలు, పశువులను దగ్గరగా మందుల డబ్బాలు ఉంచకూడదు.
- ఆకుకూరలకు మందు పిచికారీ చేసిన వెంటనే కోయరాదు. కనీసం మూడురోజుల తరువాత కోయాలి.